క్లుప్తంగా

క్రికెటర్ త్రిష పోరాటపటిమ అభినందనీయం


తానికొండ వాసు

ఎటపాక: ఐసీసీ మహిళల అండర్–19 టీ 20 ప్రపంచకప్ భారత్ సాధించడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తానికొండ వాసు ఆదివారం తెలిపారు. ఈ పోటీలో భద్రాచలంకు చెందిన గొంగడి త్రిష ఆట అభినందనీయమని, ఆమె పోరాటపటిమతో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్ గెలుచుకోవడం గర్వకారణమన్నారు. త్రిష స్ఫూర్తితో నేటి యువత క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గిరిజన చట్టాల జోలికొస్తే సహించేది లేదు


స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు నిరసన తెలుపుతున్న నాయకులు

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో చట్టాలను సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని చొడుపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ పరిధిలో గల ప్రజాప్రతినిదులు, పీసా కమిటీ సభ్యులు, నాయకులుతో మార్కెట్ యార్డులో సమావేశయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పర్యాటకాభివృద్ధి పేరుతో గిరిజనుల చట్టాలను సవరణ చేయాలని తప్పుడు వ్యాఖ్యలు చేసిన అయ్యన్నపాత్రుడు తక్షణమే గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలు జోలికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. చొడుపల్లి సర్పంచ్ లలిత, ఎంపీటీసీ సభ్యురాలు మీనాకుమారి, పీసా కమిటీ సభ్యులు ఎల్.రాజారావు, వి.దాసు, జి.అప్పారావు, నాయకులు కోరాబు కరుణానిధి, గంగన్న పడాల్, కగుపతి, సింహాచలం, రామారావు, బాబూరావు, సీతన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధం


దగ్ధమవుతున్న ఇళ్లు

ఎటపాక: మండల పరిధిలోని నల్లకుంట గ్రామం ఉయికవారిగుంపులో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. సాయంత్రం 3గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉయిక ఇరమయ్య, తెల్లం రాములమ్మ, కలుముల ధనలక్ష్మికి చెందిన గృహాలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. ఆ సమయంలో ఆయా కుటుంబాలకు చెందిన వారు వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీగా ఆస్తినష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఆయా ఇళ్లల్లోని నిత్యావసరాలు, ధాన్యం, గృహోపకరణాలు, బంగారం, కొంత నగదు మంటల్లో కాలిపోవడంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు గ్రామ రెవెన్యూ అధికారి కన్నమ్మ తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని అగ్ని ప్రమాద బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు.

మోదకొండమ్మకు పాదాల బహూకరణ


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

మాడుగుల : ఎం.కోడూరు మోదకొండమ్మకు అదే గ్రామానికి చెందిన రాపర్తి, సూర్యనారాయణ సత్యవతి దంపతులు వివిధ లోహాలతో తయారు చేసిన పాదాలు ఆలయ చైర్మన్, గ్రామ సర్పంచ్ సంజీవరావు చేతుల మీదుగా సమర్పించారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిపారు.

మాడుగుల రూరల్ : కె.జె.పురం మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మెక్కులు తీర్చుకున్నారు. భజన కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల మోదమాంబ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

మాకవరపాలెం : కొండలఅగ్రహారంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయం వద్ద శని, ఆదివారాలు తీర్థాలు జరిగాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గౌరీపరమేశ్వరుల ప్రతిమలను సోమవారం ఊరేగింపు చేసి ఘనంగా నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పసుపు సిరులు

- మార్కెట్‌లో గిరాకీ
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఆశాజనకంగా దిగుబడి
- పంట సేకరణలో నిమగ్నం
- గిట్టుబాటు ధరలు
- ఆనందంలో గిరిజన రైతులు


పసుపు కొమ్ముల సేకరణలో నిమగ్నమైన రైతులు



కుప్పగా పోసి ఉన్న పసుపు కొమ్ములు

ముంచంగిపుట్టు: మన్యం పసుపును దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి పసుపునకు దేశీయ మార్కెట్ మంచి గిరాకీ ఉంది. దీంతో గిరిజన రైతులు ఏటా పసుపు సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. గత కొన్నేళ్లుగా గిరిజన రైతులు పసుపు పంటపై పూర్తిగా దృష్టి సారించారు. గతం కంటే సాగును ఈ ఏడాది పెంచారు. ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో 289 గిరిజన గ్రామాల్లో 864 మంది గిరిజన రైతులు 1,276 హెక్టార్లలో పసుపు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చేతికందిన పసుపు పంటను సేకరించే పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో కొండపడ, కిలగాడ, బంగారుమెట్ట, మాకవరం తదితర ప్రాంతాల్లో పసుపు విస్తారంగా పండిస్తున్నారు.

రైతుల ఆశలు

పంట దిగుబడి సైతం ఈ ఏడాది బాగున్నట్టు గిరిజన రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం వారపు సంతల్లో పసుపు ధర బాగుంది. గత ఏడాది పసుపు కోమ్ములు రూ. 90 నుంచి రూ.100 వరకు ఉండగా, ఈ ఏడాది రూ.110 నుంచి రూ.125 వరకు ధర పలుకుతుంది. రానున్న రోజుల్లో మరింతగా పసుపు కోమ్ముల ధర పెరిగే ఆస్కారం ఉంటుందని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వారపు సంతల్లో పసుపు కోనుగోలు సైతం జోరుగా జరుగుతుంది. మైదాన ప్రాంతాల వ్యాపారులు నాణ్యమైన పసుపు గిరిజన వారపు సంతల్లో లభ్యమవడంతో అధికంగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజన ప్రాంత పసుపునకు విపరీతమైన డిమాండ్ నెలకొంది.పసుపు పంట చేతికి అందడంతో సంతల్లో పసుపు వ్యాపారం ప్రస్తుతం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. రానున్న రోజుల్లో పసుపు ధర మరింత పెరిగే ఆస్కారం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అంతర పంటగా సాగు

పెట్టుబడి తక్కువ.. అధిక ఆదాయం వస్తుండడంతో అంతర పంటగా గిరిజన రైతులు పసుపు పంటను సాగు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో 10 కావిడ్ల వరకు పసుపు నాటితే 25 కావిడ్ల దిగుబడి వరకు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా సేంద్రియ పద్ధతిలోని గిరిజన రైతులు పసుపు సాగు చేస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులను వాడకుండా, ప్రకృతి వ్యవసాయంలో పండిస్తుండడంతో కర్క్యుమిన్ కంటెంట్ 5శాతం ఉంటుందని, దీంతో మైదాన ప్రాంతాల్లో గిరిజన ప్రాంత పసుపునకు మంచి డిమాండ్ ఉందని అధికారులు చెబుతున్నారు.

వ్యాపారం బాగుంది



గతంలో కంటే ప్రస్తుతం పసుపునకు మంచి ధర లభిస్తుంది. కిలో రూ.125ల వరకు వ్యాపారులు కొనుగోలు చేయడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో పసుపు ధర మరింత పెరిగే ఆస్కారం ఉంది. పంట దిగుబడి బాగుండడంతో పాటు వ్యాపారం లాభసాటిగా ఉండడంతో పసుపు పంట ఈ ఏడాది ఆర్థికంగా మమ్మల్ని ఆదుకుంది. మైదాన ప్రాంతా వ్యాపారులు గిరిజన ప్రాంత వారపు సంతలకు వచ్చి పసుపును అధికంగా కొనుగోలు చేస్తున్నారు.

– ఎస్.సిద్దేశ్వరరావు, గిరిజన రైతు, డి.కుమడ గ్రామం, ముంచంగిపుట్టు మండలం

పంటల సాగుపై అవగాహన



గిరిజన రైతులకు దిగుబడితో పాటు ఆర్థికంగా లబ్ధి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నాం. గత రెండేళ్లుగా గిరిజన రైతులు పసుపు పంట సాగు విస్తీర్ణం పెంచారు. పసుపు ధర సైతం ఈ ఏడాది బాగుంది. ప్రస్తుతం వారపు సంతల్లో మైదాన ప్రాంతాల వ్యాపారులు వచ్చి అధికంగా పసుపును కొనుగోలు చేస్తున్నారు. రైతులకు అన్ని విధాలుగా పసుపు పంట మేలు చేస్తుంది. వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీనివాసబాబు, ఏవో, ముంచంగిపుట్టు.

వీడని చలి, మంచు


డుంబ్రిగుడలో కురుస్తున్న మంచు

డుంబ్రిగుడ: మండలంలో వీడని చలితో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజులుగా చలి తీవ్రత కాస్త తగ్గుముఖం పడుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం చలితో పాటు మంచు కమ్ముకుంది. ఉదయం 9 గంటలైనా మంచు తెరలు వీడలేదు. రైతులు, సంతలకు వెళ్లే వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. శని, ఆదివారాల్లో డుంబ్రిగుడ మండలంలో 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మంచు కురుస్తుండంతో ప్రయాణికులు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు.

100 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పవన్‌రెడ్డి

కూనవరం: మండల కేంద్రంలోని విజయసాధన హైస్కూల్ ప్రాంగణంలో సూర్య ఆస్పత్రి (భద్రాచలం) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్లు ఎం.గీతా పావని, డాక్టర్ ఎన్.ఎస్.పవన్‌రెడ్డి శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మలేరియా, టైఫాయిడ్, థైరాయిడ్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జయ చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ కన్యకాపరమేశ్వరి, భాస్కర్, శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నేతల నిరసన


ఎటపాకలో బడ్జెట్ కాపీ పత్రాలు దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

ఎటపాక: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం గుండాల గ్రామంలో బడ్జెట్ కాపీ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యుడు పులుసు బాలకృష్ణ మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. విశాఖ రైల్వేజోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ఐఐఐటీ, గిరిజన యూనివర్సిటీ, దుగ్గరాజపట్నం పోర్ట్, స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, రాజదాని నిర్మాణానికి నిధుల కేటాయింపులో కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పద్మ, హరి, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


చింతూరులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు లక్ష్మణ్

చింతూరు: కేంద్ర బడ్జెట్‌లో గిరిజనుల అభివృద్ధికి తీవ్ర అన్యాయం చేశారని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు పొడియం లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. బడ్జెట్‌లో పోలవరం నిర్వాసితులకు నిధులు కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి నిర్వాసితులంతా సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సుబ్బారావు, ముక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మామిడి పూత



విరబూసిన మామిడిపూత

రాజవొమ్మంగి: రంపచోడవరం డివిజన్‌లో ఏ గ్రామంలో చూసినా మామిడి చెట్లు పూత దశలో కనువిందు చేస్తున్నాయి. ఏజెన్సీ ఏడు మండలాల్లో దాదాపు 10వేల ఎకరాల్లో మామిడి చెట్లు ఉన్నాయి. కాగా ఎకరాకు 4 టన్నుల దిగుబడిని ఆశించే రైతు పంట లేక గతేడాది నష్టాలు చవి చూశాడు. ఎకరాలో కనీసం టన్ను దిగుబడి కూడా చేతికి రాకపోవడంతో నిరాశ చెందాడు. దట్టంగా కురుస్తున్న మంచు, చీడ పీడలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా మామిడి నష్టాలు ఎదుర్కొంటున్నట్టు రైతులు వాపోతున్నారు. మరోవైపు కోతులు ఈ పంటను విపరీతంగా పాడుచేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ ఏడాది పూత ఆశాజనకంగా ఉందని, చెట్లు విరగపూశాయని రైతులు చెబుతున్నారు. పూత నిలబడితే మంచి దిగుబడి రావచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో ముఖ్యంగా బంగినపల్లి, కలెక్టర్ మామిడి, పండూరు మామిడి, పంచదార, చెరకురసం తదితర రకాల మామిడి ఈ ప్రాంతంలో సాగు చేస్తున్నారు. మరోవైపు ఆవకాయ పచ్చడి తయారీకు అనువైన నీలం, దేశవాళి, కొండమామిడి కాయలకు ఏజెన్సీ ప్రాంతం ప్రసిద్ధి. మైదాన ప్రాంత వ్యాపారులు మన్యంలో మామిడి సాగు చేస్తున్న రైతులకు ఇప్పటికే పెట్టుబడి సొమ్ము అందజేశారు. ఈ ప్రాంత పరిసరాల నుంచి మామిడికాయలను రాజమహేంద్రవరం, ఏలూరు తదితర ప్రాంతాలకు తరలించి ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఏజెన్సీ మామిడి వ్యాపారులు, దళారులకు సిరులు కురిపిస్తుండగా రైతులకు మాత్రం ఆశించి ధరలు లేక నష్టాలనే మిగులుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మన్యంలో మారుతున్న వాతావరణం

- తగ్గిన చలిమంచు వాతావరణం
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

రాజవొమ్మంగి: మండల పరిసర ప్రాంతాల్లో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. నిన్నమొన్నటి వరకు రాత్రి చలికి వణికిపోయిన ప్రజలు ఇప్పుడు వేడి వాతావరణం చవిచూస్తున్నారు. ఇటీవల ఉదయం 9 గంటలు దాటినా వీడని మంచు, చలితో ఇబ్బంది పడేవారు. కాగా ఆదివారం నుంచి వాతావరణంలో గణనీయంగా మార్పులు చోటుచేసుకొన్నాయి. రాత్రి పూట 10 డిగ్రీల ఉష్ణోత్రత ఉండేది.. కాగా ప్రస్తుతం రాత్రిపూట 18 డిగ్రీలు, పగటిపూట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలు నమోదవుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రజలు వేడిమి, ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇలా ఉంటే రానున్న రోజుల్లో వేడి వాతావరణం ఇంకా ఏ స్థాయికి పెరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఉదయం 7 గంటలకు మంచుతెరలు వీడడంతో దర్శనమిస్తున్న సూరీడు

కొయ్యూరు: మండలంలో నాలుగు రోజుల నుంచి వాతావరణం వేడెక్కుతోంది. కొద్ది రోజుల క్రితం వరకు చలి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఉదయం 10 గంటలు దాటినా మంచు ప్రభావం ఉండేది. మూడు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండలు కాస్తున్నాయి. ఉక్కపోత ప్రారంభమైనట్టు పలువురు చెబుతున్నారు.

శంభువానిపాలెంలో రేపు ఎడ్ల బళ్ల పోటీలు

దేవరాపల్లి : శంభువానిపాలెంలో పరదేశమ్మ తీర్థం మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.2వేలు, వెయ్యి చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మంగళవారం ఉదయం నుంచి పరదేశమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఘనంగా రాజులబాబు పండగ


రాజులబాబు పండుగలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

అడ్డతీగల: మండలంలోని పలు చోట్ల రాజులబాబు పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రైతులు, కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఎంతో నిష్టతో మహాశివరాత్రికి నాలుగు వారాల ముందు నుంచి ఈ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ఆనవాయితీ. సమీప అటవీ ప్రాంతాల్లో చెట్లకు పసుపు, కుంకుమ అద్ది ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. మండలంలోని పైడిపుట్ట, వేటమామిడి, కోవెలపాలెం, డి.భీమవరం ప్రాంతాల్లో చాలాచోట్ల ఈ పండుగ జరుపుకున్నారు. పైడిపుట్ట వద్ద లక్ష్మీగణపతి మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజులబాబు పండులో రంపచోడవరం ఆర్డీవో ఆర్.రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతగిరి(అరకులోయ టౌన్): అనంతగిరి మండలం బొర్రా గుహల వద్ద క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం, కారుణ్య క్యాన్సర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యపానం, ధూమపానం, ఖైనీ వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి ఆహార నియమాలు పాటించాలని సూచించారు. క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఈనెల 4న అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్‌లో భారతదేశంలోనూ క్యాన్సర్ ఓ పెనుభూతంలా మారుతుందని సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి చెప్పారు. పద్మనాభ మండల ఆర్‌ఎంపీ అధ్యక్షుడు ర్యాలీ అప్పారావు, నరేష్, హరీ తదితరులు పాల్గొన్నారు.

నేడు శిరిజాంలో రామాంజనేయ తీర్థం

చీడికాడ : శిరిజాం గ్రామంలో శ్రీ రామాంజనేయ తీర్థం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయమందిస్తున్న దాత కార్తీక్

ఎటపాక: రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందిన ఇద్దరికి అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబసభ్యులకు దాత కార్తీక్ ఆర్థిక సాయమందించారు. కన్నాపురం గ్రామానికి చెందిన పొడియం రాజారావు, కుర్సం భద్రయ్య శుక్రవారం లారీ, బైక్‌ను ఢీకొన్న ఘటనలో మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను శనివారం పోస్టుమార్టం అనంతరం వారి స్వగ్రామానికి తీసుకొచ్చారు. వారు నిరుపేద గిరిజన కుటుంబాలకు చెందిన వారు కావడంతో వారికి సహాయం చేసేందుకు లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతుమిత్ర ఏజెన్సీ అధినేత రంబాల కార్తీక్ ముందుకొచ్చారు. బాధిత కుటుంబాలను ఆయన కలిసి ఒక్కో కుటుంబానికి రూ.5వేల నగదును ఆదివారం అందజేశారు.పూనెం వెంకటరావు, సొందె రమేష్, బుద్దుల నగేష్, వాసం ధర్మరాజు, నవలం రామయ్య తదితరులున్నారు.

చొడుపల్లిలో గొట్టి పండగ సందడి


పండగ సందర్భంగా సమావేశమైన గ్రామస్తులు


థింసా నృత్యం చేస్తున్న గ్రామ మహిళలు

చింతపల్లి: మండలంలో చొడుపల్లి గ్రామంలో గొట్టి పండగను సంప్రదాయబద్ధంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ అనంతరం గ్రామ పెద్దలు నిర్ణయించిన తేదీన స్థానికులంతా కలసి ఈ గొట్టి పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఈ వేడుకను పురస్కరించుకొని ముందుగా గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి, రామాలయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని మామిడితోటలో గ్రామ పెద్దలు, ఇతరులు సమావేశమయ్యారు. ఈ ఏడాది పశువుల కాపరి, గ్రామ బారికలను గ్రామ పెద్దల సమక్షంలో ఎంపిక చేసుకున్నారు. ఉత్సవంలో భాగంగా గ్రామ మహిళలు, యవతీ, యువకులు థింసా నృత్యాలు చేశారు. ఆటపాటలతో సందడి వాతావరణంలో గడిపారు. పండగకు వచ్చిన అతిథులతో కలసి గ్రామస్తులంతా సహపంక్తి భోజనాలు చేశారు. సర్పంచ్ కొర్రా లలిత, ఎంపీటీసీ సభ్యురాలు మీనాకుమారి, గ్రామ పెద్దలు కోరాబు కరుణానిధి, చిట్టిబాబు, ఉపాధ్యాయ సంఘం నాయకులు శశికుమార్, తిలక్, రత్నప్రసాద్, రవిప్రసాద్, శ్రావణ్, సునీల్, ఓంకార్, కృష్ణతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత


కొండల అగ్రహారంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

మాకవరపాలెం : మండలంలోని కొండలఅగ్రహారంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా ఈ ఉత్సవం వైభవంగా జరుపుతారు. ఈ సందర్భంగా ఈ ఏడాది కూడా గ్రామంలోని రామాలయం వద్ద శని, ఆదివారాలు తీర్థాలు జరిగాయి. ఉత్సవం నేపథ్యంలో గ్రామంలో విద్యుత్ దీపాలంకరణతోపాటు ఆదివారం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గౌరీపరమేశ్వరుల ప్రతిమలను సోమవారం ఉదయం ఊరేగింపు చేసి నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తండూరార్చన

కె.కోటపాడు : కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రామాలయంలో ఆదివారం తండూరార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయి బాల వికాస్ తరగతులకు హాజరవుతున్న విద్యార్థులతో గణపతిపూజ, ఓంకారం, వేద గాయత్రి, సాయి గాయత్రి పూజలను బాల వికాస్ గురువులు మురళి, బండారు రామలక్ష్మి, జ్యోత్స్న, ధరణి జరిపారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు సత్యసాయి భక్తులకు బోధించిన బోధనలను బాల వికాస్ తరగతులను వివరించారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు